హమ్మయ్య.. నామినేషన్లు ఓకే

- అభ్యర్థుల్లో తగ్గిన ఆందోళన
- రెండు తిరస్కరణ
- 20 నామినేషన్లకు 18 ఆమోదం



కాకినాడ రూరల్ ఆర్వో కార్యాలయంలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్వో ఇట్ల కిశోర్



కాకినాడ సిటీ నియోజకవర్గ నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు. హాజరైన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ రూరల్: ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల్లో వాటి పరిశీలన సమయంలో తీవ్ర ఆందోళన ఉంటుంది. తాము దాఖలు చేసిన నామినేషన్ల సెట్లలో ఏమైనా పొరబాట్లు ఉన్నాయా.. తిరస్కరణకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యగా అదనపు సెట్లు దాఖలు చేస్తారు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ కోసం ఎన్నో కలలు కని, దాదాపు ఐదేళ్ల పాటు ఎదురు చూసిన వారంతా ఈ ఎన్నికల్లో అదృష్టం పరీక్షించుకునే సమయం ఆసన్నమవడంతో గురువారం వరకు సంబంధిత ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సహాయ ఎన్నికల అధికారులు నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి ఎవరి దరఖాస్తులు తిరస్కరించారో, అందుకు కారణాలను సదరు అభ్యర్థులకు వివరించారు. దీంతో మిగిలిన అభ్యర్థులు హమ్మయ్యా అంటూ గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి ఈనెల 18 నుంచి 25 వరకు 20 మంది అభ్యర్థులు 35 సెట్ల నామినేషన్ పత్రాలు ఈఆర్వో ఇట్ల కిశోర్‌కు దాఖలు చేశారు. వీరిలో కాంగ్రెస్ పార్టీ తరఫున రెండు సెట్లు నామినేషన్లను దాఖలు చేసి, బి.ఫారమ్ సమర్పించని పిల్లి సుజన, అలాగే ఆ పార్టీ తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసి బి.ఫారమ్ అందజేయని తుమ్మలపల్లి అనంత వెంకట శివ ప్రసాద్ దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 18 మంది అభ్యర్థుల 32 నామినేషన్ల పత్రాలను ఆమోదించారు. ఆమోదం పొందిన నామినేషన్లను ఈ నెల 29న సదరు అభ్యర్థులు ఉప సంహరించుకునే వెసులుబాటు ఉంది.

సిటీలో ఐదు దరఖాస్తుల తిరస్కారం

కాకినాడ: కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం ముగిసింది. పోటీ చేసే అభ్యర్థులు, ప్రతిపాదకుల సమక్షంలో సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు నామినేషన్లను పరిశీలించారు. మొత్తం 22 మంది కాకినాడ సిటీ అసెంబ్లీ నుంచి నామినేషన్లు వేశారు. వీటిలో ఐదింటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. 17 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు తేలింది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29 వరకు గడువు ఉండడంతో అదే రోజు బరిలో నిలిచే తుది అభ్యర్థుల జాబితా తేలనుంది. వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయా రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులు, ప్రతిపాదకులు నామినేషన్ల పరిశీలనకు హాజరయ్యారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు నాయుడు, అనిల్, పవన్, దీపక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గ నామినేషన్ల వివరాలు ఇలా..

అభ్యర్థి పేరు	పార్టీ	నామినేషన్ సెట్లు
అన్నవరం పితాని	స్వతంత్ర	3
అన్యం విశ్వేశ్వరరావ	స్వతంత్ర	1
దడాల బాబ్జీ	జై భీమ్‌రావ్ భారత్ పార్టీ	2
కర్రి గోపాలకృష్ణ	స్వతంత్ర	1
కొరమాటి మహర్షి	తెలుగు నవ గర్జన పార్టీ	1
కురసాల కన్నబాబు	వైఎస్సార్ సీపీ	3
మాదిపల్లి రాజు	స్వతంత్ర	1
మేళం వీరాస్వామి	నవరంగ్ కాంగ్రెస్ పార్టీ	1
పలివెల స్వరూప్	లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ	2
పంతం వెంకటేశ్వరరావు	జనసేన	4
పంతం సందీప్	జనసేన	2
పట్నాల వెంకటేశ్వరరావు	జాతీయ జనసేన పార్టీ	1
పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు	తెలుగు జనతా పార్టీ	3
పిల్లి సత్యలక్ష్మి	కాంగ్రెస్ పార్టీ	3
సాధనాల రాజు	బహుజన సమాజ్ పార్టీ	1
సూర్యనారాయణమూర్తి చాగంటి	స్వతంత్ర	1
తుమ్మలపల్లి అనంత వెంకట శివప్రసాద్	స్వతంత్ర	1
వీరభద్రరావు వెలుగుబట్ల	స్వతంత్ర	1



నామినేషన్ల పరిశీలనకు హాజరైన రూరల్ నియోజకవర్గ అభ్యర్థులు

క్లుప్తంగా

ప్రజల సహకారంతో మెరుగైన పారిశుధ్యం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఏడో డివిజన్ రేచర్లపేటలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ప్రజలతో స్వయంగా మాట్లాడి సేవలను ఆరా తీశారు. హూపర్ టిప్పర్ వాహనాలకు మాత్రమే చెత్తను అందించి నగరపాలక సంస్థకు సహకరించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచగలమని స్పష్టం చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ జిలాని ఇతర సిబ్బంది ఉన్నారు.

పెదకొత్తూరులో ఎన్నికల ప్రచారం

కరప: మండలం పెదకొత్తూరులో శుక్రవారం జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరుతూ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, జేఎస్పీ నాయకుడు పంతం సందీప్ పాల్గొన్నారు.

వేసవి వినోదం ప్రారంభం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

కాకినాడ సిటీ: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి వేసవి నోదం సహకరిస్తుందని కాకినాడ ఉపవిద్యాశాఖాధికారి ఆర్‌జె డేనియల్ రాజు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేసవినోదాన్ని ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం ఎమ్మెస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞాన అభివృద్ధికి వేసవి వినోదం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమ కన్వీనర్ కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పది రోజుల పాటు విద్యార్థులకు ఉపయోగకరమైన అనేకమైన విషయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రముఖ ఇంద్రజాలికుడు వీఎస్‌వీ రమణమూర్తి, పప్పెట్రీ శిక్షకులు పిల్లి గోవిందరాజులు పాల్గొన్నారు. పాఠ్యపుస్తక రచయిత కె.వెంకట్రావు, పదో తరగతి విద్యార్థులకు కాంతి అనే అంశంపై ప్రయోగశాలతో శిక్షణను ఇచ్చారు. గణిత అవధాని పి.రవిశంకర్ గణితంలో గమ్మత్తులు అనే విషయం మీద అనేక విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పేరులేనిచెట్టు ప్రాంతంలో ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 11 జంటలు పీటలపై కూర్చుని విశేష పూజలు నిర్వహించారు, ఆలయ గోపురంపై ముందుగా విఘ్నేశ్వరుడి విగ్రహం ప్రతిష్ఠించారు. అనంతరం సత్తెమ్మ తల్లి విగ్రహాన్ని ఆలయ గర్భాలయంలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు.

కూటమి పార్టీలను తిప్పికొట్టండి



ఎన్నికల ప్రచారంలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- తప్పుడు వాగ్దానాలను నమ్మకండి
- ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి

కాకినాడ: రాజకీయ ప్రయోజనాల కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇచ్చే తప్పుడు వాగ్దానాలను వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక 37వ డివిజన్‌లోని పాతబస్టాండ్, కచ్చేరిపేట ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. గడచిన ఐదేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ 2014లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా చివరకు మేనిఫెస్టోను సైతం వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘన చరిత్ర టీడీపీదే అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొందన్నారు. తప్పుడు వాగ్దానాలను చేసే పార్టీలను పక్కన పెట్టి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసిన వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. గడచిన ఐదేళ్లలో కాకినాడ నగరంలో ప్రజల అవసరాల మేరకు కల్యాణ మండపాలు, రహదారులు, డ్రైనేజీలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు లంకే హేమలత గోపీ, బోయి చిన్నారెడ్డి, డేవిడ్, వరప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భార్య మహాలక్ష్మి ప్రచారం

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి భార్య మహాలక్ష్మి 8వ డివిజన్ ఇందిరాకాలనీ, రాజీవ్ గృహకల్ప, అయోధ్య నగర్, సగరుల కాలనీ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ద్వారంపూడికి ఓటు వేసి మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు చిట్నీడి సత్యవతి, చిట్నీడి మూర్తి, నల్లబెల్లి సుజాత, స్థానిక నాయకులు ధర్మారెడ్డి, కొండారెడ్డి, రాయుడు వాసు, గుత్తుల సత్యవతి, చిట్నీడి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో కుమార్తెలు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని తండ్రికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. 2014–19, 2019–24 మధ్య కాకినాడ నగర అభివృద్ధిని బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని కోరారు. కాకినాడ నగరం ఐదేళ్లలో ఊహించని అభివృద్ధి జరిగిందని, ఇందుకు కారణమైన ఎమ్మెల్యే ద్వారంపూడిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ ప్రణీత 29వ డివిజన్ రంగయ్య నాయుడు వీధి ప్రాంతాల్లో పర్యటించగా, డాక్టర్ అంజని 19బి సచివాలయ పరిధిలో రామాలయం ప్రాంతం నుంచి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లుడి ప్రచారం

ద్వారంపూడికి మద్దతుగా ఆయన అల్లుడు ఉదయ్‌శేఖర్‌రెడ్డి శుక్రవారం 41వ డివిజన్‌లో పర్యటించారు. నాగమల్లిచెట్టు సెంటర్‌లోని రెడ్‌క్రాస్‌వీధి, మల్లయ్య అగ్రహారం, రామాలయ ప్రాంతంతోపాటు స్థానికంగా ఉండే అపార్ట్‌మెంట్ల వద్ద ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు గోడి వెంకట్, రాకేష్‌రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



భర్తకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ద్వారంపూడి మహాలక్ష్మి



ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆయన అల్లుడు డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి





తండ్రికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమార్తెలు డాక్టర్ అంజని, డాక్టర్ ప్రణీత

మళ్లీ సీఎం.. జగనన్నే



కాకినాడ అర్బన్ 2వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు తదితరులు

- ఓటు వేసి ఆశీర్వదించండి
- కాకినాడ 2వ డివిజన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు ప్రచారం

కాకినాడ రూరల్: సంక్షేమ ప్రదాత, పేదల గుండె చప్పుడు జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవ్వబోతున్నారని.. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని కాకినాడ అర్బన్ 2వ డివిజన్ పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రచార వాహనంపై నుంచి ర్యాలీగాను, కొన్ని చోట్ల ఇంటింటికీ ప్రచారం చేసి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మంచికి మారుపేరుగా ఉన్న కన్నబాబు తమ డివిజన్‌లోకి వస్తున్నారని తెలుసుకున్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి హారతులు పట్టారు. పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల పాటు మహిళల పేరిట నేరుగా వారి ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్ములను జమ చేశారన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పథకాల అమలుతో పాటు నెలనెలా పింఛన్లు ఒకటో తేదీనే నేరుగా లబ్ధిదారుల ఇంటికి అందించామన్నారు. ప్రజలు వీటిని గుర్తించి తమ అమూల్యమైన ఓటుతో మరో సారి ఆశీర్వదించాలని, చంద్రబాబు వస్తే గతంతో జన్మభూమి కమిటీల మాదిరిగా అవినీతి పెరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో రెండో డివిజన్ ఇన్‌చార్జి, పాటి సూరిబాబు, గుత్తుల సూర్య ప్రకాష్, కొప్పిశెట్టి రమణ, శ్రీను, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు: క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ క్రీడలు మనిషికి ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని అందిస్తాయని, పాఠశాల స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత వర్సిటీ ద్వారా క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ మాట్లాడుతు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కళాశాల వార్షికోత్సవాలు రద్దు చేశామని, ఎన్నికల అనంతరం నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రతిభ చూపిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.



క్రీడాకారులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు, రెక్టార్ కేవీ రమణ

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

- ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య

తాళ్లరేవు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని విజయవాడ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య ఆదేశించారు. శుక్రవారం మండలంలోని సుంకరపాలెం, పోలేకుర్రు జంక్షన్ వద్దనున్న చెక్‌పోస్టులతో పాటు, తాళ్లరేవు ఎస్ఈబీ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద గస్తీ ముమ్మరం చేయాలని, మద్యం, నాటుసారా అక్రమ తరలింపుపై నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి, పట్టుబడిన మద్యం నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట తాళ్లరేవు ఎస్ఈబీ ఎస్సై టి.చిట్టిబాబు, సిబ్బంది ఉన్నారు.



తాళ్లరేవు ఎస్ఈబీ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీ శంకరయ్య

గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం



గంగనాపల్లిలో గీత కార్మికుడిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గీసాల శ్రీనివాసరావు



తిమ్మాపురంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు

- కదం తొక్కుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కన్నబాబు, సునీల్ గెలుపు కోసం ఓట్ల అభ్యర్థన

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్ విజయం కోసం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పండగ వాతావరణంలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయమని అభ్యర్థిస్తూ, ఐదేళ్ల జగనన్న పాలనలో జరిగిన మంచిని వివరిస్తున్నారు. శుక్రవారం గంగనాపల్లిలో మహిళలతో కలిసి వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు, మండల జేసీఎస్ కన్వీనరు గీసాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి తదితరులు ప్రచారం చేశారు. తిమ్మాపురంలో సర్పంచ్, జేఎన్‌టీయూకే వీసీ సభ్యుడు బెజవాడ సత్యనారాయణ, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు తదితరులు ప్రచారం చేశారు. గురువారం రాత్రి రాయుడుపాలెంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, కొత్తపల్లి గిరీష్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరు జంగా గగారిన్, తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

పశుపక్ష్యాదుల ఆకలి తీరుద్దాం



బోట్‌క్లబ్ వద్ద మజ్జిగ, పక్షులు, పశువుల చలివేంద్రాలు ప్రారంభించి చలివేంద్రంలో గింజలను పరిశీలిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా



చలివేంద్రంలో మజ్జిగ అందజేస్తున్న సత్యభామ

- సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా
- బోట్‌క్లబ్ వద్ద చలివేంద్రాల ఏర్పాటు

కాకినాడ రూరల్: వేసవిలో దాహార్తి తీర్చుకునేందుకు మనషులతో పాటు పక్షులు, పశువులకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేకత అని సద్గురువు డాక్టరు ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వద్ద చలివేంద్రంతో పాటు పక్షులు, పశువులకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నీటిని తమకు అందుబాటులో ఉంచమని పశు పక్ష్యాదులు ఆ భగవంతుడిని వేడుకుంటాయని, ఆయన ఏదో ఒక రూపంలో ఆ వనరులను ఏర్పాటు చేస్తాడని ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. వాటి ఆకలి తీర్చడం భగవంతుడి సేవగా ప్రజలు భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ పాత్రలో నీరు, ఆహార పదార్థాలు పెట్టాలన్నారు. ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టరు మురళీకృష్ణ, విశ్రాంత ఆర్టీఓ రామచంద్రరావు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

బోట్‌క్లబ్: స్థానిక చర్చిస్క్వేర్ సెంటర్‌లో రాయవరపు సత్యభామ కళావేదిక, హోప్‌ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రాయవరపు సత్యభామ ప్రారంభించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఏటా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనాగేంద్ర, శ్రీదేవి, మణి, హేమలత పాల్గొన్నారు.